విజయోస్తు..



- 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు
- నియోజకవర్గ వ్యాప్తంగా పరీక్షలకు హాజరుకానున్న 3,875 మంది విద్యార్థులు
- 17 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

బత్తలపల్లి: ధర్మవరం నియోజకవర్గం పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని 17 పరీక్ష కేంద్రాల్లో ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 1వ తేదీన పరీక్షలు ముగుస్తాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 3,875 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కేంద్రాల్లో పూర్తి స్థాయిలో డెస్కులు ఏర్పాటు చేశారు. ధర్మవరం టౌన్, ధర్మవరం రూరల్ మండలంలోని విద్యార్థులకు ధర్మవరం పట్టణంలో పదకొండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో ప్రభుత్వ హైస్కూల్, సంజయ్ నగర్‌లోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాల, కొత్తపేట రైల్వే స్కూల్, కాకతీయ విద్యా నికేతన్, సుందరయ్య నగర్‌లోని శ్రీగణేష్ పాఠశాల, జీవనజ్యోతి హైస్కూల్, జీవానంద హైస్కూల్, యశోద కాన్సెప్ట్ హైస్కూల్‌ను కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు ఎంఈఓలు గోపాల్ నాయక్, రాజేశ్వరి తెలిపారు. బత్తలపల్లిలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో రామాపురం, మాల్యవంతం, నల్లబోయనపల్లి, కేజీబీవీ సంజీవపురం, మండల కేంద్రంలోని నాలుగు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్ వెల్లడించారు. ముదిగుబ్బ మండలంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలు, ఏడు ప్రవేట్ పాఠశాలలు, బుక్కపట్నం మండలంలోని మారాల, కృష్ణాపురం, పాముదుర్తి పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఎంఈఓలు వేమనారాయణ, రమణప్ప తెలిపారు. తాడిమర్రి మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో దాడితోట, కునుకుంట్ల, పిన్నదరి, ఆత్మకూరు, తాడిమర్రి, కేజీబీవీ, జీవీఎం ఆర్డీటీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్ తెలిపారు.

అరగంట ముందే వెళ్లాలి..

పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో ముందురోజే వెళ్లి చూసుకుంటే మంచిది. పరీక్ష రోజు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకుని 9:15 గంటలకు తమకు కేటాయించిన గదిలో విద్యార్థులు కూర్చోవాలి. 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. పరీక్షకు తీసుకెళ్లే హాల్‌టికెట్, అట్ట, అవసరమైనన్ని పెన్నులు, పెన్సిల్, స్కేలు, రబ్బర్లను ముందురోజు రాత్రి ఒకచోట ఉంచుకోవాలి. ఇన్విజిలేటర్ మెయిన్ ఆన్సర్ బుక్‌లెట్‌కి జతపరచి ఇచ్చిన ఓఎంఆర్ షీట్ మీదేనని ధ్రువీకరించుకున్న తర్వాత పరీక్ష రాయడం మొదలు పెట్టాలి. ఆన్సర్‌షీట్లు, గ్రాఫ్, బిట్ పేపర్లను మెయిన్ ఆన్సర్‌షీట్‌కు జత చేసి దారంతో గట్టిగా కట్టడంతో పాటు పేపర్ తిప్పకునే సౌలభ్యం ఉండేలా ముడి వేయాలి.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

విద్యార్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని ఎంఈఓలు సూచిస్తున్నారు. హాల్‌టికెట్లు తప్పక తీసుకురావాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షల నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

ధర్మవరం నియోజకవర్గంలో పరీక్ష కేంద్రాలు, విద్యార్థుల వివరాలు

మండలం	కేంద్రాలు	విద్యార్థుల సంఖ్య
ధర్మవరం	11	2,572
బత్తలపల్లి	2	510
తాడిమర్రి	1	183
ముదిగుబ్బ	3	610
మొత్తం	17	3,875

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..



వేసవి దృష్ట్యా అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వసతులు కల్పిస్తాం. ప్రథమ చికిత్స వంటి సేవలకు ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచుతాం. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. పరీక్షలు సక్రమంగా, సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తాం.

– సుధాకర్ నాయక్, ఎంఈఓ, బత్తలపల్లి

ఆల్ ద బెస్ట్ స్టూడెంట్స్..



పిల్లలకు కేటాయించిన పరీక్ష కేంద్రం ఎక్కడ ఉంది. అక్కడికి సరైన సమయంలో విద్యార్థి చేరుకునేందుకు ఎలాంటి ప్లాన్ చేసుకోవాలనే దానిపై ముందుగానే దృష్టి సారించాలి. పరీక్ష ముందు రోజు రాత్రి పొద్దుపోయే వరకూ చదవమని పిల్లలపై ఒత్తిడి చేయకూడదు. పరీక్ష కేంద్రానికి వెళ్లే సమయంలో హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిల్, రబ్బరు, స్కేల్ ఉన్నాయా? లేవా? అని తల్లిదండ్రులు ఒకసారి విధిగా పరిశీలించాలి. పరీక్ష ముగిసే వరకు ఆందోళన కలిగించే విషయాలు పిల్లలకు తెలియజేయకుండా చూసుకోవాలి. పరీక్షల సమయంలో పిల్లలపై ఎట్టి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కోప్పడకూడదు. ఏదైనా తప్పు చేస్తే అది తప్పని సున్నితంగా చెప్పే ప్రయత్నం చేయాలి. పిల్లలకు నిజమైన కౌన్సిలర్లు తల్లిదండ్రులే. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ 'సాక్షి' తరఫున ఆల్ ద బెస్ట్.

క్లుప్తంగా

నాటుసారా ఆరోగ్యానికి హానికరం



మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరి అర్బన్: నాటుసారా సేవించడం ఆరోగ్యానికి హానికరమని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బత్తలపల్లి తండా, కట్లతండా, బాలప్పగారిపల్లి తండాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓతో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి గోవిందునాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాటుసారాతో అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. నాటుసారా కాయడం, తాగడం రెండూ నేరమన్నారు. నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం నాటుసారా నిర్మూలన చేస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, ఎస్ఐలు పాల్గొన్నారు.

దొంగలను పట్టిస్తే రూ.5 వేల బహుమతి

ధర్మవరం రూరల్: గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకం బోర్లకు ఏర్పాటు చేసిన కేబుల్, స్టార్టర్ పెట్టెలు ఇటీవల తరచూ చోరీకి గురవుతున్నాయని ఎంపీడీఓ సాయి మనోహర్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు తరచూ ఈ చోరీలు చేస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పోలీసుల సహకారంతో చోరీ చేసిన వ్యక్తులను పట్టిస్తే రూ.5 వేలు బహుమతిగా అందజేస్తామన్నారు.

ఏపీ రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో జిల్లా రైతు సంఘం నాయకులు

కనగానపల్లి: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ తెలిపారు. కనగానపల్లిలోని ఓబిలేసుస్వామి ఆలయంలో గురువారం రైతు సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతాంగ సమస్యలు, ప్రభుత్వ హామీలపై చర్చించారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాలమయ్య అధ్యక్షతన రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా మాదన్న, మండలాధ్యక్షుడిగా ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా గవ్వల ప్రసాద్, శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంకె నగేష్, సహాయ కార్యదర్శిగా పి.రాజేంద్రను ఎన్నుకున్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు, నాయకులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ పరిశీలన



వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ నరసింహులు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి గురువారం పరిశీలించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా అక్కడ డయాలసిస్ చేయించుకుంటున్న 22 మంది రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డయాలసిస్ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

'శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నారు'

ధర్మవరం రూరల్: ఏలుకుంట్ల గ్రామంలో మాల కులస్తుల శ్మశానవాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబిలేసు ఆరోపించారు. గురువారం ఆ సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 సంవత్సరాల క్రితం సర్వే నంబర్ 94లో 0.86 సెంట్ల గల వంక పొరంబోకు భూమిని మాల కులస్తుల శ్మశానవాటికకు ప్రభుత్వం కేటాయించిదన్నారు. సదరు స్థలానికి సర్వేయర్ కొలతలు వేసి హద్దులు చూపించడం జరిగిందని పేర్కొన్నారు. అయితే గ్రామానికి చెందిన రామనాయుడు అనే వ్యక్తి హద్దురాళ్లను తొలగించి శ్మశానవాటిక స్థలాన్ని తన పొలంలోకి కలుపుకున్నాడని తెలిపారు. అధికారులు స్పందించి శ్మశాన స్థలం కాపాడాలని కోరారు.

ఉన్నతస్థాయికి చేరుకోండి



మాట్లాడుతున్న కదిరి రూరల్ సీఐ నాగేంద్ర

గాండ్లపెంట: సమాజంలో మహిళలు అన్ని అడ్డంకులను తొలగించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర సూచించారు. గురువారం స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎఫ్ఈఎస్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ యజమాని భక్తర్వలీ మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. సృష్టికి మూలం స్త్రీ మూర్తి అని, ఇంటా బయటా ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా, రాజకీయ పరంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. సమస్యలు ఎదురైతే 100, 112 నంబర్లకు వెంటనే కాల్ చేస్తే పోలీసులు రంగ ప్రవేశం చేసి సమస్యను పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వలీబాషా, గాండ్లపెంట, ఎన్పీకుంట, తలుపుల స్వయం సంఘాల మహిళలు, ఏపీఎంలు, ఐసీడీఎస్, మహిళా రైతులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ

ధర్మవరం: విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌ను కార్మికుల వేతనాలు, పరిశ్రమ నడపడానికి మాత్రమే వెచ్చించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న కోరారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌ను కార్మికుల వేతనాలు, ముడి సరుకులు కొనుగోలుకు కేటాయించరాదని కేంద్ర మంత్రి నిబంధనలు పెట్టడం సబబుకాదన్నారు. పరిశ్రమ నడవాలంటే పాత బకాయిలు చెల్లించడం ఒకటే కాదని.. పరిశ్రమలో ఉత్పత్తుల కోసం కష్టపడుతున్న కార్మికుల వేతనాలు కూడా చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలని సూచించారు. లేకపోతే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ కో-కన్వీనర్లు అయూబ్ ఖాన్, ఆదినారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు మారుతి పాల్గొన్నారు.

మొల్లమాంబకు ఘన నివాళి





బత్తలపల్లి, కదిరి ఎంపీడీఓ కార్యాలయాల్లో మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రామాయణ కావ్య రచయిత్రి మొల్లమాంబ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహనాయుడు మాట్లాడుతూ.. మొల్ల రచించిన రామాయణంలో 879 పద్యాలు ఉన్నాయని తెలిపారు. ఎక్కువ భాగం కంద చంధస్సును అనుసరించినట్లు వివరించారు. ఎప్పుడు శూద్ర, స్త్రీ కవిత్వాన్ని హేళన చేస్తూ వీరు కూడా కవిత్వం రాయడమా అనే వారికి జ్ఞానోదయం కలిగించారని తెలిపారు. అంతకుముందు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు, విస్తరణ అధికారి క్రిష్టప్ప, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి చూపుతున్న విద్యార్థులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 84 మంది పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, యుటీఎఫ్ ముదిగుబ్బ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ శెట్టిపి జశ్వంతరెడ్డి, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి బాబా పక్రుద్దీన్, రామగిరి మండల యుటీఎఫ్ అధ్యక్షుడు బాలగొండ శివయ్య, ప్రధానోపాధ్యాయులు ఏబివి రాఘవ, వెంకట శివారెడ్డి, మురళీనాయుడు, రాజశేఖర్, శీనా, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఓడీచెరువు: మండల పరిధిలోని ఓడీచెరువు, కొండకమర్ల, గౌనిపల్లి, మిట్టపల్లి పాఠశాలలో చదువుతున్న సుమారు 286 మంది విద్యార్థులకు గురువారం హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి (ప్యాడ్, పెన్నులు) అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవి నాయక్ మాట్లాడుతూ.. శ్రీ వెంకటసాయి ఐటీఐ సంస్థ సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటసాయి ఐటీఐ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ట్రస్టు కార్యదర్శి పురుషోత్తం నాయక్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ఓడీచెరువు: భూమి కలిగిన రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయధికారి ఇలియాజ్ అహమ్మద్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలు, పెట్టుబడి సాయం మొదలగు పథకాల లబ్ధి పొందడానికి విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని పేర్కొన్నారు.

ఆర్డీటీ స్కూల్‌కు ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న ఎస్ఐ కృష్ణమూర్తి

పుట్టపర్తి టౌన్: బుచ్చయ్యగానిపల్లి ఆర్డీటీ పాఠశాలకు బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి రెండు ఫ్యాన్లు వితరణ చేశారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు ఇటీవల బుచ్చయ్యగారిపల్లి ఎస్సీ కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీటీ పాఠశాలలో ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎస్ఐ కృష్ణమూర్తి గురువారం గ్రామ పెద్దలకు రెండు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు.

దుకాణదారులపై చర్యలు తీసుకోండి



ఏడీ క్రిష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: నాసిరకం విత్తనాలను విక్రయించకుండా ఎరువుల దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లిలో నాసిరకం కళింగర విత్తనాలను సాగు చేసి.. ఆత్మహత్యాయత్నం చేసిన మురళీ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. గురువారం రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, మారుతి తదితరులు ఏడీ క్రిష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. నాసిరకం విత్తనాలు విక్రయించిన అనంతపురంలోని శ్రావణి ఎరువుల దుకాణాన్ని సీజ్ చేయాలని సూచించారు. బాధిత రైతుకు రూ.20 లక్షల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల దుకాణాలపై తరచూ దాడులు నిర్వహించి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తాడిమర్రి: నిడిగల్లు సమీపంలోని పేకాట స్థావరంపై గురువారం ఎస్ఐ కృష్ణవేణి సిబ్బందితో కలసి దాడి చేశారు. ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. మూడు ద్విచక్ర వాహనాలు, రూ.5,180 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ధర్మవరం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, అక్బర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్: తమ కాలనీలో వీధి దీపాలు, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని కందికుంట కాలనీవాసులు కోరారు. గురువారం కాలనీలో జరుగుతున్న వర్క్ ఫ్రం హోం సర్వేను పరిశీలించేందుకు వచ్చిన ఎంపీడీఓ పోలప్పకు పలు సమస్యలు విన్నవించారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వారికి హామీ ఇచ్చారు.


హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

రామగిరి: మండల పరిధిలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో గురువారం ఆలయ హుండీ కానుకలను లెక్కించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మూడు హుండీల లెక్కింపు చేపట్టగా 38 రోజులకుగానూ రూ.2,58,410 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దేవదాయ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

కాటమయ్య స్వామి ప్రభ ఊరేగింపు



అలంకరణలో కాటమయ్య స్వామి ప్రభ

బత్తలపల్లి: సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరక్షేత్రంలో కాటమయ్య స్వామి ప్రభ ఊరేగింపు వైభవంగా సాగింది. గురువారం స్వామి మూలస్థానమైన ఈదుల ముష్టూరు నుంచి కాటమయ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని వివిధ పూలతో అందంగా అలంకరించారు. ఊరేగింపు అనంతరం రాత్రి పది గంటలకు క్షేత్రానికి తరలించారు. భక్తులు కాటమయ్య స్వామి గోవింద.. గోవింద అంటూ నినాదాలు చేశారు. గురవయ్యల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ముష్టూరు గ్రామంలో నరసింహరెడ్డి, ఓబిరెడ్డి, పాటిల్ ఓబిరెడ్డి, ఆనందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, గంగాధర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, నాగిరెడ్డి, చిట్టిబాల మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కరణం సూర్యప్రకాష్‌రావుతోపాటు పలువురు గ్రామ పెద్దలు ఆలయ ధర్మకర్త ముష్టూరు సుధాకరరెడ్డి ఇంటి వద్దకు చేరుకుని సమావేశమయ్యారు. ఉత్సవాల నిర్వహణపై చర్చించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. గురువారం బైపాస్ నుంచి శివాలయం వీధి వరకూ సున్నపుగుట్ట తండా రోడ్డు పక్కన ఉన్న కంపచెట్లను జేసీబీతో తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా కంపచెట్లు పెరగడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని పలువురు గ్రామస్తులు ఎంపీడీఓకు విన్నవించారు. వెంటనే స్పందించిన ఎంపీడీఓ కంపచెట్లను తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.


భక్తిశ్రద్ధలతో శ్రీగిరి రథోత్సవం

పుట్టపర్తి రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం ముఖద్వారం వద్ద అందంగా అలంకరించిన రథంలో సత్యసాయి చిత్రపటాన్ని కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం రథాన్ని లాగారు. ప్రశాంతి నిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా రథాన్ని లాగి ప్రశాంతి నిలయానికి చేర్చారు.

కటాక్షించు.. సరస్వతీ మాత

తలుపుల: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్ఎం శంకరన్న ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు సరస్వతీ మాత చిత్రపటాన్ని కొలువుదీర్చి, పూజలు చేపట్టారు. పరీక్షల్లో మంచి మార్కులు రావాలని విద్యార్థులు వేడుకున్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు



అలంకరణలో ఆంజనేయుడు

ముదిగుబ్బ: మండల పరిధిలోని దామానుపల్లిలో వెలసిన ఆంజనేయ స్వామికి గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సింధూరంతో అభిషేకం, ఆకుపూజ చేశారు. అనంతరం ముదిగుబ్బ, పులివెందుల మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు గుట్ట చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు.

కంచె ధ్వంసం

పుట్టపర్తి అర్బన్: మార్లపల్లిలో రైతు శేషాద్రిరెడ్డి తన పొలానికి ఏర్పాటు చేసుకున్న కంచెను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధిత రైతు మాట్లాడుతూ.. పొలానికి ఏర్పాటు చేసిన 19 నిలువురాళ్లు, పలు గేట్ వాల్వ్‌లను ధ్వంసం చేశారని తెలిపారు. గత రెండేళ్లలో ఇలా మూడవ సారి జరిగిందన్నారు. లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఫిర్యాదు చేస్తే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు ఉచిత సలహా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

టపాసుల గోదాములో అగ్ని ప్రమాదం

నల్లచెరువు: మండల కేంద్రంలోని దామోదర గోదాములో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గోదాములోని టపాసులు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అదే గోదాములో కె.పూలకుంటకు చెందిన కిరాణా కొట్టు వ్యాపారి సుధాకర నిల్వ ఉంచిన సరుకులు, మండల కేంద్రంలో చిరు వ్యాపారి రామాంజనేయులుకు చెందిన పుచ్చకాయలు ఈ ప్రమాదంలో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గోదాములో బాణాసంచా అక్రమంగా నిల్వ చేసినట్లు తెలుస్తోంది.

ఉద్యోగం పేరుతో మోసం

కదిరి టౌన్: కుటాగుళ్లకు చెందిన రాజు ఉద్యోగం పేరుతో మోసం చేసి రూ.3 లక్షలు తీసుకున్నాడని బాధితుడు మెహరుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కుటాగుళ్లకు చెందిన రాజు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఇదే ప్రాంతానికి చెందిన మెహరుద్దీన్‌కు తెలిపాడు. ఇందుకు రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. రాజు మాటలు నమ్మిన మెహరుద్దీన్ తొలుత అడ్వాన్స్‌గా రూ.25 వేలు ఇచ్చాడు. తరువాత మెయిల్ ద్వారా జాబ్ ఆఫర్ లెటర్ పంపించారు. రెండు నెలలు ఆన్‌లైన్‌లో ట్రైనింగ్ ఇచ్చారు. రాజును పూర్తిగా నమ్మిన మెహరుద్దీన్ మిగిలిన రూ.2.75 లక్షలు కూడా ఇచ్చాడు. అయితే ఇప్పటి వరకూ రాజు.. మెహరుద్దీన్‌కు ఎలాంటి జాబ్ చూపించలేదు. డబ్బులు కూడా తిరిగి ఇవ్వక పోవడంతో మెహరుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజు అతడి స్నేహితుడు నాగచంద్రపై కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.